# చాంపియన్స్ ఫైట్

## నేడు భారత్, న్యూజిలాండ్ ఫైనల్ పోరు

**టైటిల్‌పై కన్నేసిన ఇరు జట్లు**

**దుబాయ్‌లో సండే ధమాకా**

ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీలో టైటిల్ పోరుకు వేళయింది. మెగాటోర్నీలో అపజయమెరుగకుండా ఎదురైన ప్రత్యర్థి నల్లా చిత్తుచేసిన భారత్‌కు, ఫేవరెట్లలో ఒకటిగా బరిలోకి దిగిన న్యూజిలాండ్ ఫైనల్లో తలపడనున్నాయి. అరేబియా అందాల నగరం దుబాయ్ వేదికగా ఆదివారం టీమ్‌ఇండియా, కివీస్ అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఐసీసీ టోర్నీల్లో కొరకరాని కొయ్యగా మారిన కివీస్‌కు చెక్ పెట్టేందుకు టీమ్‌ఇండియా పావులు కదుపుతుంటే కలగా మారిన ఐసీసీ ట్రోఫీ కోసం న్యూజిలాండ్ పట్టుదలతో ఉంది. తమకు అచ్చొచ్చిన స్పిన్ తంత్రంతో కివీస్ రెక్కలు విరిచేందుకు రోహిత్ సేన కదన కుతూహలంతో ఉంటే దీటైన పోటీ కోసం సాంట్నర్ గ్యాంగ్ ప్రణాళికలు రచిస్తున్నది. మొత్తంగా పుష్కర కాలం తర్వాత భారత్ మరోమారు చాంపియన్స్ ట్రోఫీని ముద్దాడాలని కోట్లాది మంది అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్న వేళ రెండు జట్ల మధ్య పోరు రసవత్తరంగా సాగే అవకాశముంది.

దుబాయ్: ఏడారి తీర నగరం దుబాయ్ చిరస్మరణీయ పోరుకు వేదిక కాబోతున్నది. ఆదివారం దుబాయ్‌లో భారత్, న్యూజిలాండ్ మధ్య చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ పోరు జరుగనుంది. గత 15 రోజులుగా అభిమానులను అలరిస్తున్న మెగాటోర్నీ ఆఖరి అంకానికి చేరుకుంది. రెండు అత్యుత్తమ జట్లు టైటిల్ పోరులో తలపడబోతున్నాయి. ముచ్చటగా మూడోసారి టైటిల్‌ను ఒడిసిపట్టుకోవాలని భారత్ ప్రయత్నాల్లో ఉంటే..తీరని కలగా మారుతున్న ఐసీసీ ట్రోఫీని ఎలాగైనా దక్కించుకోవాలన్న గట్టి కోరికతో కివీస్ కనిపిస్తున్నది. మెగాటోర్నీలో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో అజేయమెరుగని రోహిత్‌సేన.. అదే ఊపులో కివీస్‌ను కట్టడి చేయాలని చూస్తున్నది. పిచ్, వాతావరణ పరిస్థితులపై మంచి అవగాహనతో కనిపిస్తున్న భారత్ అందుకు తగ్గట్లు పక్కా వ్యూహంతో పోటీకి దిగనుంది. లీగ్ దశలో నలుగురు స్పిన్నర్లతో కివీస్‌కు చెక్ పెట్టిన టీమ్‌ఇండియా అదే పంథాను అనుసరించే అవకాశముంది. మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి..టీమ్‌ఇండియాకు తురుపుముక్కగా మారనున్నాడు. వైవిధ్యమైన స్పిన్‌తో కివీస్ బ్యాటర్లకు వరుణ్ కళ్లెం వేసే చాన్స్ ఉంది. మరోవైపు ఫైనల్‌కు ముందు స్టార్ పేసర్ మ్యాట్ హెన్రీ గాయం కివీస్‌కు ప్రతిబంధకంగా మారింది. పిచ్‌తో సంబంధం లేకుండా స్వింగ్ రాబట్టే హెన్రీ గైర్హాజరీ కివీస్ గెలుపు అవకాశాలపై ప్రభావం చూపించనుంది.

**'రోకో' ప్రయాణం కొనసాగేనా?**

గత దశాబ్ద కాలంగా 'రోకో' ద్వయం రోహిత్‌శర్మ-విరాట్ కోహ్లీ భారత చిరస్మరణీయ విజయాల్లో కీలకమవుతూ వస్తున్నారు. తమదైన ఆట తీరుతో ప్రత్యర్థి జట్ల పాలిట సింహస్వప్నంలా మారుతూ విజయాలు అందిస్తున్నారు. ఒంటిచేత్తో మ్యాచ్‌లను గెలిపించే సత్తా ఉన్న ఈ ఇద్దరు తమ కెరీర్ కొనసాగిస్తారా లేదా అనేది అందరి అభిమానుల మెదళ్లను తొలుస్తున్నది. గతేడాది వెస్టిండీస్‌లో టీ20 ప్రపంచకప్ గెలిచిన వెంటనే రోకో ద్వయం తమ కెరీర్లకు అనూహ్యంగా వీడ్కోలు పలికారు. ఆదివారం కివీస్‌తో మ్యాచ్‌లో భారత్ గెలిస్తే వన్డే కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తారా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలింది. తమ కెరీర్‌కు ఘనమైన ముగింపు పలుకాలనే ఉద్దేశముంటే అది జరిగినా జరగవచ్చు. ఈ మ్యాచ్ విషయానికొస్తే నలుగురు స్పిన్నర్లు, ఇద్దరు పేసర్లతో టీమ్‌ఇండియా విన్నింగ్ కాంబినేషన్ కొనసాగించనుంది. వరుణ్ చక్రవర్తి, కుల్దీప్‌యాదవ్, అక్షర్, జడేజా నలుగురు రాణిస్తే కప్ మన ఖాతాలో చేరినట్లే. కెప్టెన్ రోహిత్‌శర్మ, గిల్ ఫామ్ కలవరపరుస్తున్నా.. మిడిలార్డర్‌లో విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్ నిలకడ జట్టుకు లాభిస్తున్నది. మెగాటోర్నీలో టాపార్డర్ విఫలమవుతూ వస్తున్నా..మిడిలార్డర్ బ్యాటర్లు జట్టును ఆదుకుంటున్నారు. కోహ్లీ, అయ్యర్‌కు తోడు అక్షర్, రాహుల్, హార్దిక్, జడేజా జత కలిస్తే కివీస్‌కు కష్టాలు తప్పకపోవచ్చు. మొత్తంగా 12 ఏండ్ల తర్వాత చాంపియన్స్ ట్రోఫీని ముద్దాడాలని భారత్ కృత నిశ్చయంతో ఉంది.



**కల సాకారానికై:**

ఐసీసీ టోర్నీల్లో టైటిళ్లు కివీస్‌ను ఊరిస్తూనే ఉన్నాయి. ప్రతీసారి మెగాటోర్నీల్లో సెమీస్, ఫైనల్ వరకు చేరుకుని ఉత్త చేతులతో వెనుదిరిగిన సందర్భాలు కోకొల్లలు. సరిగ్గా 24 ఏండ్ల క్రితం కెన్యాలో ఇదే భారత్‌పై ఫైనల్లో గెలిచిన న్యూజిలాండ్ తొలిసారి నాకౌట్ ట్రోఫీని గెలుచుకుంది. తిరిగి అప్పటి నుంచి ఇప్పటి వరకు కివీస్‌కు టైటిల్ కల కలగానే మిగిలింది. కాలం గడుస్తున్నా..వారి అదృష్ట రేఖలు మాత్రం మారడం లేదు. ఈసారి ఫేవరెట్లలో ఒకటిగా బరిలోకి దిగిన కివీస్..తమ తొలి పోరులోనే ఆతిథ్య పాకిస్థాన్‌ను ఓడించింది. బంగ్లాదేశ్‌పై భారీ విజయమందుకున్న కివీస్..భారత్ చేతిలో కంగుతిన్నది. కీలకమైన సెమీస్‌లో సఫారీలను వేటాడి భారత్‌తో ఫైనల్‌కు అర్హత సాధించింది. బ్యాటింగ్ పరంగా రచిన్ రవీంద్ర, విలియమ్సన్ సూపర్ ఫామ్ మీదుండటం కివీస్‌కు కలిసి వచ్చే అంశం. మిడిలార్డర్‌లో మిచెల్, లాథమ్, ఫిలిప్స్, బ్రేస్‌వెల్ నిలకడలేమి ఆందోళన కల్గిస్తున్నది. బౌలింగ్ విషయానికొస్తే.. హెన్రీ తుది జట్టులో ఉంటాడా లేదా అన్నది ప్రశ్నగా మారగా, కెప్టెన్ సాంట్నర్, బ్రేస్‌వెల్ తమ స్పిన్ జోరు కొనసాగిస్తున్నారు. వీరికి రచిన్, ఫిలిప్స్ జత కలిస్తే తిరుగుండదు.



**పిచ్, వాతావరణం:** దుబాయ్ పిచ్ ఒకింత స్లోగా స్పందించే అవకాశముంది. టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్ ఎంచుకుని ప్రత్యర్థి ముందు భారీ స్కోరు ఉంచే చాన్స్ ఉంది. మంచు కురిసే అవకాశం లేకపోవడంతో రెండో ఇన్నింగ్స్‌లో స్పిన్ బౌలింగ్‌కు పెద్దగా ఇబ్బందులు ఉండకపోవచ్చు.

**జట్లు అంచనా:**

**భారత్:** రోహిత్(కెప్టెన్), గిల్, కోహ్లీ, శ్రేయాస్, అక్షర్, రాహుల్, హార్దిక్, జడేజా, కుల్దీప్, షమీ, వరుణ్.

**న్యూజిలాండ్:** యంగ్, రచిన్, విలియమ్సన్, మిచెల్, లాథమ్, ఫిలిప్స్, బ్రేస్‌వెల్, సాంట్నర్(కెప్టెన్), జెమీసన్, హెన్రీ/డఫీ/స్మిత్, రూర్కీ.

మ: 2.30 నుంచి స్టార్ స్పోర్ట్స్
జియో హాట్ స్టార్‌లో

### జత కలిస్తే ఇంకా బాగుంటుంది

**12** గత 14 ఐసీసీ టోర్నీల్లో 12 సార్లు భారత్ నాకౌట్‌కు అర్హత సాధిస్తే అందులో మూడింటిలో గెలిచింది.

**45** కోహ్లీ మరో 45 పరుగులు సాధిస్తే..చాంపియన్స్ ట్రోఫీలో అత్యధిక పరుగులు చేసిన గేల్‌ను దాటేస్తాడు.

**1-3** ఐసీసీ నాకౌట్ మ్యాచ్‌ల్లో భారత్, న్యూజిలాండ్ నాలుగు సార్లు తలపడితే, కేవలం ఒకే సారి గెలిచింది. వన్డే వరల్డ్ కప్(2023) సెమీస్‌లో టీమ్ఇండియా గెలుపు ఖాతాలో వేసుకుంది.

## యూపీ 225/5

**డబ్ల్యూపీఎల్‌లో రికార్డు స్కోరు**

**జార్జియా సూపర్ సెంచరీ మిస్**

**ఆర్‌సీబీపై వారియర్స్ విజయం**




లక్నో: మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో మరో పోరు అభిమానులను అలరించింది. శనివారం డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)తో జరిగిన మ్యాచ్‌లో యూపీ వారియర్స్ 12 పరుగుల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. దీంతో ప్రస్తుతం యూపీ 6 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిస్తే..వరుసగా ఐదో ఓటమి ఖాతాలో వేసుకున్న ఆర్‌సీబీ(4) లీగ్ నుంచి వైదొలిగింది. ఇదిలా ఉంటే ఢిల్లీ(10), గుజరాత్(8), ముంబై(8) ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించాయి. పరుగుల వరద పారిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన యూపీ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 225/5 స్కోరు చేసింది. డబ్ల్యూపీఎల్ చరిత్రలో అత్యధిక టీమ్ స్కోరుగా ఇది రికార్డుల్లోకెక్కింది. ఓపెనర్ జార్జియా వోల్(56 బంతుల్లో 99 నాటౌట్, 17ఫోర్లు, సిక్స్) సూపర్ సెంచరీతో కదంతొక్కింది. అయితే ఆఖర్లో పరుగు తేడాతో సెంచరీ చేసే అవకాశాన్ని చేజార్చుకుంది. ఆర్‌సీబీ బౌలర్లను ఉతికి ఆరేస్తూ జార్జియా కొట్టిన కొట్టుడుకు స్టేడియం మొత్తం హోరెత్తిపోయింది. తన ఇన్నింగ్స్‌లో 17 ఫోర్లు, ఓ భారీ సిక్స్‌తో చెలరేగిన జార్జియా జట్టుకు రికార్డు స్కోరు అందించింది. జార్జియా వేర్‌హామ్(2/43) రెండు వికెట్లు తీసింది. లక్ష్యఛేదనకు దిగిన ఆర్‌సీబీ 19.3 ఓవర్లలో 213 పరుగులకు ఆలౌటైంది. రీచా ఘోష్(69) ఒంటరిగా పోరాడినా లాభం లేకపోయింది. ఎకల్‌స్టోన్(3/25), దీప్తి(3/50)రాణించారు. ధనాధన్ సెంచరీతో అదరగొట్టిన జార్జియాకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

## శ్రీనిధి గెలుపు జోరు



మహిల్‌పూర్: ప్రతిష్ఠాత్మక ఐ-లీగ్‌లో శ్రీనిధి దక్కన్ ఎఫ్‌సీ(ఎస్‌డీఎఫ్‌సీ) గెలుపు జోరు కొనసాగుతున్నది. శనివారం జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి టీమ్ 1-0 తేడాతో ఢిల్లీ ఎఫ్‌సీపై అద్భుత విజయం సాధించింది. ఈ సీజన్‌లో ప్రత్యర్థి వేదికలపై శ్రీనిధికి ఇది నాలుగో గెలుపు కావడం విశేషం. ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన పోరులో శ్రీనిధి తరఫున డేవిడ్ కాస్టెండా మునోజ్(62ని) ఏకైక గోల్ చేశాడు. ఎస్‌డీఎఫ్‌సీ మూడు మార్పులతో బరిలోకి దిగడం కలిసొచ్చింది.

## బధిరుల ముక్కోణపు విజేత భారత్

న్యూఢిల్లీ: బధిరుల ముక్కోణపు టీ20 సిరీస్‌లో ఆతిథ్య భారత్ టైటిల్ విజేతగా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్లో భారత్ 7 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై ఘన విజయం సాధించింది. భారత బధిరుల క్రికెట్ అసోసియేషన్(ఐడీసీఏ) ఆధ్వర్యంలో జరిగిన ఈ టోర్నీలో కుల్దీప్‌సింగ్ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'తో పాటు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు కైవసం చేసుకున్నాడు.

## విలియమ్స్ స్థానంలో బాచ్

న్యూఢిల్లీ: గాయపడ్డ దక్షిణాఫ్రికా పేసర్ లిజాడ్ విలియమ్స్ స్థానంలో ఆ దేశానికే చెందిన కార్బిన్ బాచ్‌ను ముంబై ఇండియన్స్ తమ జట్టులోకి తీసుకుంది. మోకాలి గాయం కారణంగా రానున్న ఐపీఎల్ సీజన్‌కు పూర్తిగా దూరమైన విలియమ్స్‌కు ఎంపికైన బౌలింగ్ ఆల్‌రౌండర్ బాచ్..86 టీ20ల్లో 59 వికెట్లు పడగొట్టాడు.

## సీఎం 39వ ఢిల్లీ పర్యటన రద్దు

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి 39వ సారి వెళ్లాల్సిన ఢిల్లీ పర్యటన రద్దయింది. ఆదివారం ఉదయం ఢిల్లీకి వెళ్లాల్సిన సీఎంకు ఏఐసీసీ పెద్దలు ఫోన్ చేసినట్టు తెలుస్తున్నది. ఢిల్లీకి ఎవరూ రావొద్దని తేల్చిచెప్పినట్టు సమాచారం. హైకమాండ్ ఆదేశించడంతోనే సీఎం తన పర్యటనను రద్దు చేసుకున్నారని తెలిసింది.

## కాంగ్రెస్‌లో బీజేపీ కోవర్టులు!

మొదటిపేజీ తరువాయి...

వ్యక్తమవుతున్నాయి. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ సీఎంగా ఉంటూ ప్రధానిని మూడుసార్లు కలిశారు. సొంత పార్టీ సీఎంలకు లభించని ప్రధాని అపాయింట్‌మెంట్ ప్రతిపక్ష సీఎం అయిన రేవంత్‌కు ఎలా లభిస్తుందనే సందేహాలు కాంగ్రెస్‌లో వ్యక్తమయ్యాయి. వారంరోజుల క్రితం హుటాహుటిన ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్ మోదీతో భేటీ అయ్యారు. ఎప్పుడు పడితే అప్పుడు మోదీ అపాయింట్‌మెంట్ లభించడం, రేవంత్ అడిగిన పనులను ప్రధాని ఆమోదించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**సీఎంపై ఆది నుంచి అనుమానమే!**

వాస్తవానికి సీఎం రేవంత్‌రెడ్డి ఆరెస్సెస్ నేపథ్యం నుంచి వచ్చారు. దీంతో కాంగ్రెస్ అధిష్ఠానం ఆయనపై మొదటినుంచి అనుమానాస్పదంగానే వ్యవహరిస్తున్నదనే అభిప్రాయాలున్నాయి. అనివార్య పరిస్థితుల్లో సీఎం చేసిందే తప్ప.. ఇష్టంతో కాదనే అభిప్రాయాలున్నాయి. సీఎం ఎప్పుడు ఢిల్లీ వెళ్లి ప్రధాని, కేంద్రమంత్రులను కలిసినా ఆయన వెంట కాంగ్రెస్ విధేయులైన సీనియర్ మంత్రులు, నేతలు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నది. మొదటి రెండుసార్లు ప్రధానితో రేవంత్ భేటీ అయినప్పుడు డిప్యూటీ సీఎం భట్టి వెళ్లగా, ఇటీవల మూడోసారి మంత్రి శ్రీధర్‌బాబు వెళ్లారు. పార్టీలో, ప్రభుత్వంలో జరుగుతున్న పరిణామాలపై కాంగ్రెస్ విధేయుల నుంచి ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటున్నది. ఓవైపు సీఎంగా రేవంత్‌ను నడిపిస్తూనే మరోవైపు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటుందనే చర్చ జరుగుతున్నది. సీఎం రేవంత్ పక్కదారి పడితే.. పరిస్థితిని ఎదుర్కొనేందుకు పలువురు సీనియర్ నేతలను సిద్ధం చేసినట్టు తెలిసింది.

# తెలిసే ద్రోహం.. తెలంగాణలో విధ్వంసం

మొదటిపేజీ తరువాయి...

ఇందులో భాగమేనా? అంటే అవుననే అంటున్నాయి కాంగ్రెస్‌లోని ఉన్నతస్థాయి వర్గాలు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు ఆరు గ్యారెంటీలు, డిక్లరేషన్ల పేరుతో హామీలు గుప్పించిన విషయం తెలిసిందే. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఈ హామీలన్నింటిని అమలు చేస్తామంటూ నాడు మాయ మాటలు చెప్పిన కాంగ్రెస్ పెద్దలు.. ఇప్పుడు '420' రోజులు దాటినా ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక చేతులెత్తేశారు. హామీల అమలుపై ప్రజలు ప్రశ్నిస్తుంటే.. కుంటిసాకులు చెప్తూ తప్పించుకుంటున్నారు.

**మీనాక్షి.. ముందే హెచ్చరించారా!**

కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జిగా మీనాక్షి నటరాజన్ వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి ఇటువంటి వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అయితే ఎన్నికల సమయంలో ప్రజలకు ఆరు గ్యారెంటీలు ఇవ్వడంపై కాంగ్రెస్ పార్టీలో పెద్ద కథే నడిచినట్టు తాజాగా తెలిసింది. మీనాక్షి నటరాజన్.. ప్రస్తుత రాష్ట్ర పరిస్థితిపై ముందుగానే హెచ్చరించినట్టు తెలిసింది. తెలంగాణలో పార్టీ ఇస్తున్న హామీలు అమలుచేయడం సాధ్యం కాదని, తర్వాత ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని స్పష్టం చేసినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. అయినప్పటికీ ఆమె హెచ్చరికల్ని బేఖాతరు చేసిన అధిష్ఠానం.. అధికారం దక్కించుకోవడమే ఏకైక ఎజెండాగా ఆరు గ్యారెంటీలను గుప్పించినట్టు తెలిసింది. ఢిల్లీ వర్గాల సమాచారం ప్రకారం.. మీనాక్షి నటరాజన్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాష్ట్రంలో కాంగ్రెస్ తరపున పోల్ అబ్జర్వర్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా తెలంగాణలో క్షేత్రస్థాయిలోని అంశాలపై కచ్చితమైన నివేదిక ఇవ్వాల్సిందిగా ఆమెను అధిష్ఠానం ఆదేశించింది. ఇందులో భాగంగానే ఇక్కడ జరుగుతున్న అన్ని పరిణామాలు, పరిస్థితులపై నేరుగా అగ్రనేత రాహుల్‌గాంధీకి ఎప్పటికప్పుడు నివేదికలు ఇస్తూ వచ్చారు. మీనాక్షి నటరాజన్‌కు పార్టీలో ముక్కుసూటి మనిషిగా పేరుంది. దీంతోపాటు ఆమె రాహుల్‌గాంధీకి సన్నిహితురాలు. ఈ నేపథ్యంలో ఇక్కడ రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ప్రకటిస్తున్న హామీలు, గ్యారెంటీలపై ఆమె ఆశ్చర్యానికి గురైనట్టు తెలిసింది. ఈ హామీలను అమలు చేయాలంటే రాష్ట్ర బడ్జెట్, ఆర్థిక పరిస్థితి ఏ మాత్రం సరిపోదని ఆమె అప్పుడే తేల్చిచెప్పారట. ఇందుకు సంబంధించి నేరుగా రాహుల్ గాంధీకి పూర్తి వివరాలతో కూడిన టెక్నికల్ రిపోర్ట్‌ను అందించినట్టు సమాచారం. ఈ సందర్భంగా ఆమె పలు హెచ్చరికలు కూడా చేసినట్టు తెలిసింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలంటే రాష్ట్ర ఖజానాపై భారీగా ఆర్థిక భారం పడుతుందని, ఒకవేళ హామీలు అమలు చేయని పక్షంలో ప్రజల్లో పార్టీపై, ప్రభుత్వంపై వ్యతిరేకత ఏర్పడుతుందని తేల్చి చెప్పినట్టు సమాచారం.

**అమలు సంగతి తర్వాత చూద్దాం... ముందు మనం గెలవాలి**

ఆరు గ్యారెంటీల అమలుపై మీనాక్షి నటరాజన్ ఇచ్చిన నివేదికను, చేసిన హెచ్చరికలను రాహుల్‌గాంధీ బేఖాతరు చేసినట్టు తెలిసింది. 'ఇవన్నీ కాదు.. ముందు మనం గెలవాలి' అని రాహుల్‌గాంధీ బదులిచ్చినట్టు సమాచారం. 'ఇవే గ్యారెంటీలతో కర్ణాటకలో అధికారంలోకి వచ్చాం. ఏడాదైనా అక్కడ హామీలు అమలు చేయలేదు. ఏమైనా అయిందా. ఏం కాలేదు కదా. కాబట్టి ఇప్పుడు మనకు తెలంగాణ రాష్ట్రం గేట్ వే ఆఫ్ సౌత్ ఇండియా లాంటిది. కాబట్టి అక్కడ కచ్చితంగా గెలవాలి. హామీల అమలు సంగతి తర్వాత చూద్దాం.. ముందు ఆరు గ్యారెంటీలు ఇచ్చేద్దాం. ఏం జరుగుతుందో ఆ తర్వాత చూసుకుందాం.' అంటూ మీనాక్షి నటరాజన్‌కు చెప్పినట్టు విశ్వసనీయంగా తెలిసింది. స్వయంగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ రాష్ట్రానికి పలు మార్లు వచ్చి ఆరు గ్యారెంటీలపై హామీలు గుప్పించి.. 100 రోజుల్లోనే అమలు చేస్తామని రాష్ట్ర ప్రజలకు చెప్పారు.

**అన్నీ తెలిసి... అధికారం కోసమే హామీలిచ్చారా?**

సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ఢిల్లీలో ఓ కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ చేసిన నమ్మక ద్రోహాన్ని బయటపెట్టాయి. ఆరు గ్యారెంటీల అమలు అసాధ్యమని సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా అంగీకరించారు. అంటే అన్నీ తెలిసే కేవలం అధికారం కోసమే ఆరు గ్యారెంటీల హామీలు గుప్పించినట్టు ఆయన వ్యాఖ్యలు వెల్లడించాయి. సీఎం రేవంత్‌రెడ్డి, మీడియా ప్రతినిధి సంభాషణ ఇలా కొనసాగింది..

**మీడియా ప్రతినిధి:** తెలంగాణ ప్రభుత్వానికి రూ. 3.75 లక్షల కోట్ల అప్పు ఉందని తెలిసినా గ్యారెంటీల పేరుతో ఎన్నికల్లో అనేక రకాల హామీలు ఇచ్చారు. ఉదాహరణకు నిరుద్యోగులకు రూ.4 వేల భృతి, రైతులకు, వ్యవసాయ కూలీలకు పలు హామీలిచ్చారు. ఫండ్స్ లేనప్పుడు ఇన్ని హామీలు ఎందుకు ఎలా ఇచ్చారు? సీఎం కుర్చీలో కూర్చున్న తర్వాత 'గ్యారెంటీలకు డబ్బులు ఖర్చు చేయలేనని' అర్థమైందా? మరి అప్పులు ఉన్నాయని తెలిసి, నిధులు లేవని తెలిసి కూడా బడ్జెట్‌లో గ్యారెంటీల అమలు కోసం రూ. 50వేల కోట్లు ఎలా కేటాయించారు? అప్పులున్నప్పుడు హామీలు ఎలా ఇచ్చారు?

**సీఎం:** మరేం చెయ్యాలి.. రేసు (ఎన్నికల పరుగుపందెం) అట్లనే నడుస్తున్నది కదా. రేసులోకి (ఎన్నికల బరిలోకి) దిగాక వెనుకబడకుండా ఉండాలంటే పరుగెత్తాల్సిందే. 'స్పీడ్ థ్రిల్స్.. బట్ కిల్స్' అనే స్లోగన్ తెలుసు కదా.. ఇదీ అంతే! తీరా ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం తరపున కనీసం రూ.500 కోట్లను కూడా మూలధన వ్యయానికి, పెట్టుబడులకు ఖర్చు చేయలేని పరిస్థితి ఉంది.

సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలను పరిశీలిస్తే.. కాంగ్రెస్ సర్కారు తెలంగాణ ప్రజలను కావాలనే మోసం చేసిందనే విషయం తేటతెల్లమైంది. హామీల అమలు అసాధ్యమని ఆ పార్టీకి ముందే తెలుసు. అయినప్పటికీ కేవలం అధికారం కోసం.. గ్యారెంటీలను గుప్పించి.. ప్రజలను మోసం చేసి గద్దెనెక్కింది.

అధికార దాహంతో వెంపర్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ.. అలవికాని హామీలిచ్చి రాష్ట్ర ప్రజలను వాడుకున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికలకు ముందే రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి సంబంధించి కాంగ్రెస్ నేతలకు పూర్తి అవగాహన ఉన్నది. తమ పార్టీ ఇచ్చే హామీలకు భారీ మొత్తంలో నిధులు అవసరమవుతాయని కూడా ఆ పార్టీ నేతలకు తెలుసు. ప్రస్తుత పరిస్థితుల్లో హామీల అమలుకు అవసరమైన నిధులు సమకూర్చడం సాధ్యమయ్యే పని కూడా కాదని తెలుసు. దీనికితోడు అడ్డగోలు హామీలపై నాడే కొందరు సీనియర్లు అభ్యంతరం వ్యక్తం చేసినా వినకుండా రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ హామీలపై ముందుకు వెళ్లినట్టు పార్టీలో చర్చ జరుగుతున్నది. ఆ హామీలకు ఆకర్షితులైన తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ను గద్దెనెక్కించారు. కానీ ఇప్పుడు అదే కాంగ్రెస్ పార్టీ హామీలు అమలు చేయలేక చేతులెత్తేసింది. 100 రోజుల్లో అమలు చేయాల్సిన గ్యారెంటీలను రేపు మాపు అంటూ సాగదీస్తున్నది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదంటూ కుంటిసాకులు చెప్తున్నారు. మరి ఎన్నికలకు ముందు హామీలు ఇచ్చేటప్పుడు ఈ విషయం తెలియదా అని ప్రజలు తిరిగి ప్రశ్నిస్తున్నారు. అన్నీ తెలిసే తమను మోసం చేసి.. అధికారం చేజిక్కించుకోవడానికే హామీలు ఇచ్చారా అంటూ నిలదీస్తున్నారు.

### మళ్లీ సీన్‌లోకి మీనాక్షి.. అధిష్ఠానం డబుల్ గేమ్

హామీల అమలుపై తానిచ్చిన నివేదికను పట్టించుకోకపోవడంతో అసంతృప్తికి గురైన మీనాక్షి నటరాజన్ రాష్ట్ర అబ్జర్వర్ నుంచి తప్పుకొన్నారు. దీంతో ఆమె స్థానంలో అధిష్ఠానం అశోక్ శంకర్‌రావు చవాన్‌ను నియమించింది. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలతో ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చింది. అయితే మీనాక్షి నటరాజన్ ముందుగా హెచ్చరించిన పరిస్థితులు ఇప్పుడు రాష్ట్రంలో కండ్ల ముందుకొచ్చాయి. హామీలు అమలు చేయకపోవడంతో రేవంత్ సర్కారుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. గత ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీపై ఆరోపణలు, వాస్తవ పరిస్థితులు ఢిల్లీకి చేరకపోవడంతో తెలంగాణ ఇన్‌చార్జిగా వెళ్లాలని రాహుల్‌గాంధీ మళ్లీ మీనాక్షి నటరాజన్‌ను కోరినట్టు తెలిసింది. గత అనుభవాల దృష్ట్యా ఆమె నిరాకరించడంతో.. 'ఈసారి అలా జరగబోదని, మీరు వెళ్లాల్సిందే.. మీరు ఏది చెప్పినా అడ్డు చెప్పబోము' అని అధిష్ఠానం చెప్పినట్టు సమాచారం. మీనాక్షి నటరాజన్ ఇక్కడికి వచ్చీరాగానే క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహించి.. అసలు తెలంగాణలో ఏం జరుగుతున్నదో అధిష్ఠానానికి పూర్తి వివరాలతో నివేదిక ఇచ్చినట్టు తెలిసింది. ఇందులో పలు సంచలన విషయాలను పొందుపరిచినట్టు విశ్వసనీయ సమాచారం. దీనిపై మళ్లీ పునరాలోచనలో పడ్డ కాంగ్రెస్ అధిష్ఠానం.. ఈ నివేదికలపైనా చర్యలకు తాత్సారం చేస్తున్నట్టు తెలిసింది. తెలంగాణ నుంచి ఫండింగ్‌ను ఆశిస్తున్న అధిష్ఠానం మీనాక్షి నివేదికను పక్కకు పెట్టినట్టు తెలిసింది.

**కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీలు.. నాటి అమలు తీరు**

| గ్యారెంటీ | అమలైందా.. లేదా? |
|---|---|
| 1. మహిళలకు ప్రతి నెల రూ. 2500 | అమలు కాలేదు |
| 2. రూ.500కే గ్యాస్ సిలిండర్ | పాక్షికంగా అమలు |
| 3. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం | అమలైంది |
| 4. రైతులకు రూ.15 వేలు | ఈ సీజన్‌లోనే ప్రారంభం (రూ. 12 వేలకు కుదింపు) |
| 5. రైతు కూలీలకు రూ.12 వేలు | అమలు కాలేదు |
| 6. వరి పంటకు రూ.500 బోనస్ | కేవలం సన్న ధాన్యానికే అమలు |
| 7. 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు | పాక్షికంగా అమలు |
| 8. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు | అమలు కాలేదు |
| 9. ఇండ్లులేని వారికి ఇంటి స్థలం | అమలు కాలేదు |
| 10. ఉద్యమకారులకు 250 గజాల స్థలం | అమలు కాలేదు |
| 11. విద్యార్థులకు 5 లక్షల విద్యాభరోసా కార్డు | అమలు కాలేదు |
| 12. మండలానికో ఇంటర్నేషనల్ స్కూల్ | అమలు కాలేదు |
| 13. రూ.4 వేల పింఛను | అమలు కాలేదు |
| 14. 10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ | అమలైంది |

# తెలంగాణ తెర్లు వెనుక కాంగ్రెస్ అసమర్థత


**అధికారం కోసమే హామీలిచ్చామన్న సీఎం రేవంత్‌రెడ్డి**

**ఎన్నికల బరిలో హామీలు ఇవ్వాల్సిందేనని స్పష్టీకరణ**

**తెలంగాణ ఆర్థిక పరిస్థితి అంత మంచిగలేదని వ్యాఖ్య**

**కుర్చీలో కూర్చున్నంక అసలు విషయం అర్థమైందని వెల్లడి**

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): తెలంగాణ తెర్లయిపోవడం వెనుక అధికార కాంగ్రెస్ అవివేకం, పాలకుల అసమర్థతతోపాటు నమ్మించి చేసిన మోసం దాగి ఉన్న ట్టు తాజాగా వెల్లడైంది. రాష్ట్రంలో నెలకొన్న వ్యవసాయ, సామాజిక, ఆర్థిక సంక్షోభాలకు కాంగ్రెస్ చేసిన నమ్మకద్రోహమే ప్రధాన కారణమని తేటతెల్లమైంది. అమలు చేయలేని గ్యారెంటీలు ఇస్తే రాష్ట్రం ఆగమైపోతదని తెలిసి కూడా కాంగ్రెస్ హామీలు గుప్పించి రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేసింది. సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ఢిల్లీలో ఓ టీవీ చానల్ కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ చేసిన నమ్మక ద్రోహానికి సాక్షిభూతంగా నిలుస్తున్నాయి. రేవంత్‌రెడ్డి, మీడియా ప్రతినిధి సంభాషణ ఇలా కొనసాగింది.



**జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్:** తెలంగాణ ప్రభుత్వానికి రూ.3.75 లక్షల కోట్ల అప్పు ఉందని తెలిసినా గ్యారెంటీల పేరిట ఎన్నికల్లో అన్ని రకాల హామీలు ఇచ్చారు. ఉదాహరణకు నిరుద్యోగులకు రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. రైతులకు, వ్యవసాయ కూలీలకు పలు హామీలిచ్చారు. ఫండ్స్ లేనప్పుడు మీరు ఇన్ని హామీలు ఎలా ఇచ్చారు?

**సీఎం రేవంత్:** తెలంగాణ అప్పులు రూ. 3.75 లక్షల కోట్లు కాదు. తెలంగాణ అప్పులు రూ.7 లక్షల కోట్లు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం నెలకు రూ.18,500 కోట్లు. దీంట్లో నుంచి ప్రభుత్వోద్యోగులకు వేతనాలు, పింఛన్ల చెల్లింపునకు రూ.6,500 కోట్లు ఖర్చు చేయాలి. అప్పులు, వడ్డీలకు మరో రూ. 6,500 కోట్లు కట్టాలి. అలా తిన్నా తినకున్నా.. ఛాయ్ తాగినా.. తాగకపోయినా.. రూ.13 వేల కోట్లను నెలలో పదో తేదీ రాకముందే కట్టాలి. ఇక మిగిలిన రూ.5,500 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేయాల్సి ఉంది. ఇది ప్రస్తుత తెలంగాణ పరిస్థితి. తెలంగాణ అంత మంచిగేంలేదు.

**జర్నలిస్ట్ రాజ్‌దీప్:** గ్యారెంటీల సంగతేంటి? నిరుద్యోగులకు ఇస్తామన్న భృతి ఎలా?

**సీఎం రేవంత్:** సరైన ప్రశ్న వేశారు రాజ్‌దీప్ జీ.. మీలాగే, నేను కూడా తెలంగాణ అప్పులు రూ.3.75 లక్షల కోట్లని భ్రమపడ్డా. అందుకే, వచ్చే ఆదాయంతో గ్యారెంటీల కోసం ఏమైనా చేయవచ్చని అనుకొన్నా. కుర్చీలో కూర్చున్న తర్వాత అసలు విషయం తెలిసొచ్చింది.

**జర్నలిస్ట్ రాజ్‌దీప్:** (ఆశ్చర్యపడుతూ..) సీఎం కుర్చీలో కూర్చున్న తర్వాత 'గ్యారెంటీలకు డబ్బులు ఖర్చు చేయలేనని' మీకు అర్థమైందని ఇప్పుడు చెప్తున్నారా?

**సీఎం రేవంత్:** గ్యారెంటీలకు కాదు.. రుణాల చెల్లింపుల గురించి చెప్తున్నా.

**జర్నలిస్ట్ ప్రీతి:** గ్యారెంటీల గురించి అడిగితే అప్పుల గురించి చెప్తున్నారు. రెడ్డి గారూ.. దీనికి సంబంధించి నేను కొన్ని గణాంకాలు చెప్తాను. అప్పులు ఉన్నాయని తెలిసినప్పటికీ.. 2024 బడ్జెట్‌లో రూ.50 వేల కోట్ల ను గ్యారెంటీలకు కేటాయించారు. కొత్త అప్పులు రూ.80వేల కోట్లు చేయనున్నట్టు చెప్పారు. అప్పులు ఉన్నప్పుడు హామీలెలా ఇచ్చారు?

**సీఎం రేవంత్:** మరేం చెయ్యాలి. రేసు (ఎన్నికల పరుగుపందెం) నడుస్తుంది కదా ప్రీతీజీ ! రేసులోకి (ఎన్నికల బరిలోకి) దిగాక వెనుకబడకుండా ఉండాలంటే పరుగెత్తాల్సిందే. 'స్పీడ్ థ్రిల్స్.. బట్ కిల్స్' అనే స్లోగన్ తెలుసు కదా.. ఇదీ అలాగే..! ఉచితాలకు వ్యతిరేకంగా ప్రచారం చేసిన మోదీ ఢిల్లీలో ఉచిత గ్యారెంటీలు ఇచ్చారు. మరెవ్వరూ ఆయన్ని ప్రశ్నించరేం? ప్రభుత్వం తరపున కనీసం రూ.500 కోట్లను కూడా మూలధన వ్యయానికి, పెట్టుబడులకు ఖర్చుచేయలేని పరిస్థితి ఉంది ఇప్పుడు.